క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని బేతనియా ప్రార్థనా మందిరంలో మంగళవారం స్పెషల్ జనరల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు బేతనియా సొసైటీ ప్రెసిడెంట్‌గా వై.కనకరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా పి.రాజన్న, జనరల్ సెక్రటరీగా డేవిడ్ ప్రభాకర్, ట్రెజరర్‌గా స్వామిదాసులను ఎన్నుకున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కలిగించాలి



మాట్లాడుతున్న డీపీఎం భాస్కర్

అట్లూరు : పౌష్టికాహారంపై గర్భవతులకు అవగాహన కల్పించాలని డీపీఎం భాస్కర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం వైద్యాధికారి డాక్టరు హమీదా బేగం ఆధ్వర్యంలో ఆశాడే సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి గర్భవతులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సలహాలు ఇవ్వాలన్నారు. అలాగే గ్రామాలలో పర్యటిస్తూ వడదెబ్బ నుంచి రక్షించుకునే చర్యలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్.ఓబాయపల్లెలో వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని ఎన్.ఓబాయపల్లె గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి పండుగ కావ్య తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలో 104 వాహనం ద్వారా వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నల్లేరు విశ్వనాథరెడ్డి

బద్వేలు : కాశినాయన మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ నల్లేరు విశ్వనాథరెడ్డి వేడుకలను మంగళవారం పోరుమామిళ్లలోని ఆయన స్వగృహంలో అభిమానులు, పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలా నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పలువురు జడ్పీటీసీలు సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామస్థాయి నాయకులు రైతులు, స్నేహితులు తరలివచ్చి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ ధన్యవాదాలు తెలపడంతో విందు ఏర్పాటు చేశారు.

శుద్ధినీటి యంత్రం, కుట్టు మిషన్లు పంపిణీ



ఆశ్రమానికి ఇచ్చిన నీటి శుద్ధి యంత్రం

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఎంవీఆర్ కుటుంబ సభ్యులు వివేకానంద కాలనీలోని వాత్సల్య అనాథాశ్రమానికి శుద్ధి నీటి యంత్రం అందించారు. అలాగే మత్స్య కాలనీలో వికసిత కుట్టుమిషన్ సంస్థకు కుట్టుమిషన్లు అందించారు. రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలోని ఎంవీఆర్ విగ్రహానికి కళాశాల కరస్పాండెంట్ ఉమా, మురళీధర్‌రెడ్డి, రాజారాంరెడ్డి, అప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కినేని ఫ్యాన్స్ నల్లం రవిశంకర్, కొండూరు వెంకటసుబ్బయ్య, మాజీ కౌన్సిలర్ గుమ్మటమయ్య, ఎంవీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అంకురార్పణ, పంచగవ్యం, ధ్వజారోహణ, ఎదుర్కోళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

వినూత్నంగా డ్వాక్రా మహిళల స్టాల్స్ ఏర్పాటు

పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని విశాలమైన మైదానంలో మంగళవారం ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి డ్వాక్రా సంఘాల మహిళలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 50వేల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది బ్యాంకు రుణాలతో పాటు వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి పొంది సొంతంగా ఇంటి వద్దే ఉంటూ వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేసి వ్యాపారాలను సాగిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గానికి సంబంధించి 500 మందిచే 50 స్టాల్స్‌ను ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్టాల్స్ ఏర్పాటుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందించడంతోపాటు మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. తాము డ్వాక్రా సంఘం ద్వారా ఎంత రుణం తీసుకున్నది, వైఎస్సార్ ఆసరా ద్వారా ఎంత లబ్ధి పొందింది, ఏఏ వ్యాపారం చేస్తున్న విషయాలను ఎమ్మెల్యే రాచమల్లుకు మహిళలు వివరించారు.

జగనన్న సాయాన్ని ఎన్నటికీ మరువలేం

డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన సహాయాన్ని ఎన్నటికీ మరువలేమని పలువురు డ్వాక్రా మహిళలు సభలో వివరించారు. వైఎస్సార్ ఆసరా ద్వారా రుణమాఫీ చేయడంతో రూ.లక్షలు పెట్టి వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా స్థిరపడ్డామని తమ అభిప్రాయాలను వెల్లడించారు. 26వ వార్డుకు చెందిన డ్వాక్రా మహిళ ఖదిరున్నీసా మాట్లాడుతూ తాము రుణాలు తీసుకుని వ్యాపారం సాగిస్తూ సొంత కాళ్లపై నిలబడ్డామన్నారు. అదే వార్డుకు చెందిన దస్తగిరమ్మ మాట్లాడుతూ తమకు రూ.4.80 లక్షలు రుణ మాఫీ జరిగిందని, టిఫెన్ సెంటర్ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నామన్నారు. రాజరాజేశ్వరి స్వయం సహాయ సంఘం అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడుతూ గతంలో తాను ఆర్థిక అవసరాల కోసం కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఇతర జిల్లాలకు వెళ్లి వడ్లు కొనుగోలు చేసి బియ్యం వ్యాపారం చేస్తున్నానన్నారు. దీనికంతటికి కారణం జగన్ ప్రభుత్వమేనని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, ఆప్కాబ్‌చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, రాజుపాళెం వైస్ ఎంపీపీ ఎస్ఏ నారాయణరెడ్డి, గోపల్లె సర్పంచ్ జీరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్లు, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా కన్వీనర్ మద్దూరి దేవి, మెప్మా సీఎంఎం కెజాయి జాస్లిన్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వెంకటసుబ్బమ్మ, సీఓలు, ఆర్పీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.



స్టాల్స్ పరిశీలిస్తూ డ్వాక్రా మహిళలను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

జగన్ ప్రభుత్వంలోనే మహిళలకు ఆర్థిక భద్రత

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో వినూత్నంగా డ్వాక్రా మహిళల ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కొర్రపాడు రోడ్డులోని విశాలమైన మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ వైఎస్ జగన్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళల రుణాలన్నింటినీ మాఫీ చేస్తున్నారన్నారు. ఇప్పటికే మూడో వంతు రుణమాఫీ జరిగిందని, ఈకారణంగానే డ్వాక్రా మహిళలు ఆర్థికంగా స్థిరపడి తామే సొంతంగా ఇళ్లలో ఉత్పత్తులను తయారు చేసి అమ్మకాలను సాగిస్తున్నారన్నారు. మహిళల ఆర్థిక స్వేచ్ఛ కోసం భుజం తట్టి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరాగాంధీ హయాం నుంచి డ్వాక్రా సంఘాలు ఆవిర్భవించాయని, జగన్ ప్రభుత్వంలో వీటికి మరింత వెలుగు వచ్చిందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినా డ్వాక్రా రుణాలు మాఫీ చేయలేదన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే సీఎం లక్ష్యం

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ



మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

బద్వేలు అర్బన్ : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారి ముఖాలలో సంతోషం చూడడమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. వైఎస్సార్ ఆసరా మూడవ విడత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పురపాలక సంఘంలోని 1045 స్వయం సహాయక సంఘాలలోని 10450 మంది మహిళలకు రూ.8.94 కోట్లు లబ్ధి చేకూరనుందని తెలిపారు. అనంతరం సంఘాలకు సంబంధించిన మెగాచెక్కును విడుదల చేసి స్వయం సహాయక గ్రూపు సభ్యులకు అందజేశారు. అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సంఘాల సభ్యులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, సగర, ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, సివిల్ సప్లెస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మండల అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, మెప్మా టీఎంసీ అయ్యవారయ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే జగన్ ధ్యేయం

- మహిళలు సీఎంకు అండగా నిలవాలి
- చంద్రబాబును ఎవరూ నమ్మవద్దు
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం మైదుకూరులోని డీసీఎల్ ఫంక్షన్ హాల్‌లో మండలం, మున్సిపాలిటీలోని డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన మూడో విడత ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు డ్వాక్రా రుణాల మాఫీ అని హామీ ఇచ్చి నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. అదే జగన్ మోహన్‌రెడ్డి ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ మహిళలకు ఏటా ఆసరా కింద ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నిరుద్యోగులను మోసగిస్తే, మాట ఇవ్వకపోయిన జగన్ 2.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశం కల్పించారని కొనియాడారు.

మహిళలు అండగా నిలవాలి :

మహిళలు తలుచుకుంటే మేలు చేసే వారికి అండగా నిలుస్తారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా వంటి పథకాలలో, అధికారంలో మహిళలకు ప్రాధాన్యతనిస్తున్న జగన్‌కు చేదోడుగా, అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ప్రలోభపెడతాడని మహిళలు ఎవరూ నమ్మవద్దన్నారు. రూ.3-5 వేలు ఇస్తామని, ఆవసరమైతే ఇంటికి కిలో బంగారం ఇస్తామని చంద్రబాబు చెబుతాడని, ఇవ్వకుండా మోసం చేస్తాడని అన్నారు. మైదుకూరు మండలంలోని 582 సంఘాలకు రూ.4,12,25,453, మున్సిపాలిటీలోని 660 సంఘాలకు రూ.4,86,37,870 చెక్కులను కార్యక్రమంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ డ్వాక్రా మహిళలు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎ.ప్రసన్న లక్ష్మి, ఎంపీపీ థామస్, మున్సిపల్ వైస్ చైర్మన్లు షరీఫ్, ఊటుకూరు రఘురామిరెడ్డి, నానుబాల చిన్నకొండమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ బండి నాగేంద్ర ప్రసాద్, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ కుళ్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే సీఎం లక్ష్యం

గోపవరం : పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. టీ.సండ్రపల్లె సచివాలయం పరిధిలో కొత్తరేకలకుంట, సిద్ధార్థనగర్, మీరబ్బుల్లాయపల్లె గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా వారికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరాలు వెల్లడిస్తూ బుక్‌లెట్‌ను అందించారు. అవ్వా తాతలు ఎక్కడ కనిపించినా వారి వద్దకు ఎమ్మెల్యే వెళ్లి వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ పింఛన్ వస్తుందా అని అడిగి ఆప్యాయంగా పలుకరించారు. సమస్యలు ఏవైనా ఉన్నాయా అని ప్రజలను అడుగగా కొత్తరేకలకుంటలో నిర్మించుకుంటున్న జగనన్న ఇళ్లకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు కోరగా, ఇళ్ల పూర్తయ్యేలోపు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అక్కడే ఉన్న సంబంధిత అధికారులను కూడా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, మల్లెంకొండేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గోవిందరెడ్డి, మాజీ ఎంపీటీసీ సాంబశివారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

రైతులకు అందుబాటులో ఉండాలి



ఈ-క్రాప్, ఈకేవైసీ ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న ఏడీఏ నాగరాజు

అట్లూరు : రైతు భరోసా కేంద్రాల పరిధిలోని ప్రతి రైతుకు అందుబాటులో ఉండాలని సంబంధిత సిబ్బందికి బద్వేలు డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎం.నాగరాజు సూచించారు. మండల పరిధిలోని ముత్తుకూరు, కుంభగిరి రైతు భరోసా కేంద్రాలను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ-క్రాప్, ఈకేవైసీ రికార్డులను పరిశీలించారు. రైతులతో సమావేశమై రబీలో సాగు చేసిన పంటల వివరాలను తెలుసుకున్నారు. పంట ధృవీకరణ పత్రాలను అందజేశారు. సిబ్బందితో మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌కు పొలంబడి నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. అలాగే ప్రతి ఆర్బీకే పరిధిలో 20 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ చేసుకునేందుకు అనువైన గోడౌన్‌ను గుర్తించాలన్నారు. అనంతరం పలువురు రైతులు సాగు చేఉసిన రాగిపంటను పరిశీలించి చిరుధాన్యాల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు, కుంభగిరి, కొండూరు రైతుభరోసా కేంద్రాల అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు ఎం.సునీత, దేవగుడి సందీప్ కుమార్, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంవీఆర్ జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో మంగళవారం కళాశాల చైర్మన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి 79వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంవీఆర్ కాంస్య విగ్రహానికి కళాశాల కరస్పాండెంట్ ఉమా మురళీధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రవిశంకర్, ఎంవీఆర్ కుమారులు మురళీధర్‌రెడ్డి, రాజారాంరెడ్డి, అప్కాబ్ చైర్మన్ మల్లేల ఝాన్సీరాణి పూలమాల వేసి నివాళి అర్పించారు. 58 మంది వ్యాయామ విద్యార్థులు జిల్లా ఆస్పత్రి రక్తనిధికి రక్తదానం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. డాక్టర్ కవిత, టెక్నీషియన్లు ప్రసాదరెడ్డి, రామకృష్ణ, మహేష్, వైద్య సిబ్బంది, కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థిని

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

పోరుమామిళ్ల : వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఉదయం 9 :30 ఉంటుందని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

కలసపాడు : స్థానిక సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ విజయ్‌కుమార్‌రెడ్డి, ఏఈ బ్రహ్మానందరెడ్డిలు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ లైన్‌మెన్ కుమార్‌బాబు, లైన్‌మెన్లు రత్నంరాజు, గోపాల్, జేఎల్ఎం లక్ష్మిరెడ్డి, రవి, దస్తగిరి, గురుస్వామి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేరువగా వైద్య సేవలు

బద్వేలు అర్బన్ : పేదలందరికి చేరువగా వైద్య సేవలు ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాసుపత్రులను మరింత అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వాసుపత్రి)ని 30 పడకల నుండి 50 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన ఓపీ, ఐపీ వార్డుల నూతన భవనాలను మంగళవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమాదేవి, ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రాంప్రసాద్, ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

హనుమంతవాహనంపై ఆదిచెన్నకేశవస్వామి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో గల శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన మంగళవారం స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే బుధవారం స్వామి వారికి గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వాకమళ్ళ రంగారెడ్డి, ధర్మకర్తలు నారాయణరెడ్డి, వసుంధరమ్మ, వెంకటరమణ, సుశీలమ్మ, కృష్ణకుమారి, ఆలయ అర్చకులు రమేష్‌శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై దృష్టి సారించాలి

మండల వైద్యాధికారి రాజేష్ కుమార్

చాపాడు : గ్రామాల్లోని ప్రతి రోజూ తిరిగే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కుటుంబ నియంత్ర ఆపరేషన్లపై దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. టీబీ, ఆర్సీ పోర్టల్, ఏఎన్సీ, పిల్లల నమోదుపై అవగాహన కల్పించారు. పారిశుధ్యం, చేతులు కడుక్కోవడంపై ప్రాముఖ్యత, సీజనల్ వ్యాధులు, రక్త హీనత, క్షయ, లెప్రసీ కేసుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు పోషక ఆహార పదార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్ కుమార్

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, మనం తీసుకునే ఆహారంలో పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు తప్పనిసరిగా ఉండేలా చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీవాణి, ఓబులేసు, సీహెచ్ఓ రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బి.మఠంలో బస్‌షెల్టర్ ఏర్పాటు ఎప్పుడో..!



మల్లేపల్లె రోడ్డులో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం, మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో బస్‌షెల్టర్ లేక పోవడంతో సమీప గ్రామాల ప్రజలతోపాటు యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మఠం నాలుగు రోడ్ల కూడలిలో గతంలో గతంలో ఎస్ఐగా పని చేసిన లోసారి సుధాకర్ దాతల సహకారంతో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయించారు. ఇది ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. రోడ్ల విస్తరణలో భాగంగా బస్‌షెల్టర్‌ను ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించారు. స్థానిక ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డిలు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి రోడ్ల విస్తరణ చేయించారు. దీంతో ట్రాఫిక్ వ్యవస్థ స్తంభించకుండా వాహనాలు సాఫీగా వెళ్తున్నాయి. అయితే రోడ్ల విస్తరణ చేసి ఏడాది అవుతున్నా ఇంత వరకు తిరిగి బస్‌షెల్టర్ ఏర్పాటుకు అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోలేదు. ఎంపీపీ, జెడ్పీటీసీలు మాత్రం ఎక్కడ ఏర్పాటు చేయాలని స్థలం పరిశీలిస్తున్నారే తప్పా.. ఇంకా నిర్ణయించలేదు. మల్లేపల్లె రోడ్డులో, లేక బ్రహ్మంసాగర్ రోడ్డులో ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నారే తప్పా, ముందుకు రావడం లేదు. వేసవి కాలంలో ఎండలు తీవ్రమయ్యాయి. దూర ప్రాంతాల నుంచి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు బస్సులు వచ్చేంత వరకు ఎక్కడ ఉంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా బస్‌స్టాండ్ కోసం స్థలం పరిశీలిస్తున్నారు. ఇప్పటికే రెండు, మూడు సార్లు జిల్లా ఆర్టీసీ అధికారులు పరిశీలించారే తప్పా ఎక్కడా అనేది నిర్ధారించ లేదు. ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి వీర భక్తుడు. ఆయన ప్రతి నెలో రెండు, మూడు సార్లు స్వామి దర్శనం కోసం వస్తుంటారు. బస్‌స్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేతోపాటు దేవస్థానం నిర్వాహకులు చైర్మన్‌కు విన్నవించారు. ఆయన కూడా బ్రహ్మంగారిమఠంలో బస్‌స్టాండ్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇది కార్యరూపం దాల్చాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం కనీసం బస్‌షెల్టర్ అయినా ఏర్పాటు చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మల్లేపల్లె హైస్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత



మల్లేపల్లె జెడ్పీ హైస్కూల్ ముఖద్వారం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడటంతో.. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులను ఇటీవల డిప్యుటేషన్‌పై బదిలీ చేశారని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లెక్కల రమేష్‌రెడ్డి, ఉపసర్పంచ్ చీలేకాంపల్లె కొండారెడ్డి తెలిపారు. ఇక్కడ పని చేస్తూ సస్పెండ్ అయిన ప్రధానోపాధ్యాయుడు నాయక్ విద్యార్థులకు సెక్షన్లు ఏర్పాటు చేయకపోవడంతో.. ఉపాధ్యాయులు అధికంగా ఉన్నారనే భావనతో విద్యాశాఖ అధికారులు డిప్యుటేషన్‌పై బదిలీ చేసినట్లు తెలుస్తోంది. కానీ ఇక్కడ 10 గ్రామాల నుంచి 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 360 మంది బాలబాలికలు చదువుతున్నారు. వారికి పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బి.మఠంలో కూడా 360 మంది విద్యార్థులు చదువుతుంటే.. అక్కడ మాత్రం ఒక క్లాసుకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ ఉన్న వారిని అక్కడికి మార్చారు. ఈ విషయాన్ని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి దృష్టికి విద్యా కమిటీ చైర్మన్ లెక్కల రమేష్‌రెడ్డి, ఉపసర్పంచ్ చీలేకాంపల్లె కొండారెడ్డి తీసుకువెళ్లారు. ఆయన ఎంఈఓ, డీఈఓలతో మాట్లాడగా సెక్షన్లు లేని కారణంగా ఉపాధ్యాయులను బదిలీ చేశామని తెలిపారన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలోనైనా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని వారు కోరుతున్నారు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆర్‌జేడీ చొరవ చూపి డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి తమ పాఠశాలకు పంపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.